క్లుప్తంగా

గృహనిర్మాణాలు వేగవంతం చేయాలి



దెందులూరులో గ్రామ కార్యదర్శులతో మాట్లాడుతున్న ఎంపీడీవో లక్ష్మి

దెందులూరు: అన్ని గ్రామాల్లో జగనన్న ఇళ్ల నిర్మాణాలు వేగవంతం కావాలని, ప్రభుత్వ కార్యక్రమాలు అమలులో జగనన్న ఇళ్ల నిర్మాణం అత్యంత ప్రాధాన్యతగా గ్రామ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, హౌసింగ్ ఉద్యోగులు తీసుకోవాలని దెందులూరు ఎంపీడీవో ఏబీపీవీ లక్ష్మి అన్నారు. శనివారం ఎంపీడీవో కార్యాలయంలో మండలంలో అన్ని గ్రామాల గ్రామ కార్యదర్శులతో జగనన్న ఇళ్ల నిర్మాణం వేగవంతం, సమస్యలు, ప్రారంభించిన ఇళ్లు, ప్రారంభం కాని ఇళ్లు ఇతర అంశాలపై గ్రామాల వారీగా సమీక్షా సమావేశం నిర్వహించారు. నిర్మాణాల విషయంలో అలసత్వం వహిస్తే, అధికారులు, సంబంధిత కార్యదర్శులు బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు.

ఫారెస్ట్ కార్పొరేషన్ డైరెక్టర్ ప్రసాద్ వైద్యానికి ఆర్థిక సాయం



పళ్ళెం ప్రసాద్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి

దెందులూరు: అనారోగ్యంతో వైద్యశాలలో చికిత్స పొందుతున్న ఫారెస్ట్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పళ్ళెం ప్రసాద్‌ను శనివారం ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి పరామర్శించారు. త్వరితగతిన కోలుకోవాలని ఆకాంక్షించారు. వైద్యం నిమిత్తం రూ. 50వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఎమ్మెల్యే వెంట ఏలూరు జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు ఘంటా ప్రసాద్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు దేరా ఆనంద్, పెదవేగి మండల వైసీపీ నాయకులు బొద్దు సతీష్ ఉన్నారు.

ప్రమాణ స్వీకార మహోత్సవానికి తరలిరండి

పెదపాడు: లక్ష్మీపురంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం ఆదివారం ప్రమాణ స్వీకారం చేయనున్నట్టు ఏఎంసీ చైర్మన్ అప్పన కనకదుర్గా ప్రసాద్ అన్నారు. పెదపాడు మండలంలోని అప్పనవీడు అభయాంజనేయస్వామి ఆలయం నుంచి ఉదయం 7 గంటలకు ర్యాలీగా బయలు దేరి పెదవేగి మండలంలోని లక్ష్మీపురం గ్రామానికి ర్యాలీగా వెళతామని అన్నారు. అనంతరం ఉదయం 11.25 నిమిషాల సమయంలో ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అధ్యక్షతన నిర్వహించే ప్రమాణ స్వీకార మహోత్సవానికి నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన నాయకులు కార్యకర్తలు అభిమానులు తరలిరావాలని కోరారు.

గణపవరంలో భారీ వర్షం



గణపవరం- ఏలూరు రోడ్డుపై వర్షంనీరు

గణపవరం: వారం రోజులుగా ఎండల తీవ్రతతో ఉక్కిరిబిక్కిరి అయిన ప్రజలకు శనివారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షం కాస్త ఉపశమనం కలిగించింది. శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఈదురు గాలులతో కూడి వర్షం కురిసింది. తెల్లవారు జామున భారీ వర్షం కురవడంతో భూమి కాస్త చల్లబడి ప్రజలకు వేసవి తాపం నుంచి కాస్త ఉపశమనం లభించింది.

వ్యవసాయ మార్కెట్ కమిటీకి నూతన పాలకవర్గం

నేడు చైర్మన్, ఇతర సభ్యులు ప్రమాణ స్వీకారోత్సవం



మార్కెట్ యార్డు ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, ఇతర నాయకులు

దెందులూరు/పెదవేగి : దెందులూరు నియోజకవర్గం పరిధిలోని లక్ష్మీపురం ఏఎంసీ (వ్యవసాయ మార్కెట్ కమిటీ) నూతన పాలకవర్గం కొలువు తీరనుంది. ఏపీ మార్కెటింగ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ చిరంజీవి చౌదరి 20 మందితో కూడిన దెందులూరు ఏఎంసీ పాలకవర్గాన్ని నియమిస్తూ లిఖితపూర్వక ఆదేశాలు జారీ చేశారు. ఈ కమిటీ ఒక సంవత్సరం పాటు అధికారంలో ఉంటుంది.

పాలకవర్గ సభ్యులు వీరే

వ్యవసాయ మార్కెట్ చైర్మన్‌గా అప్పన కనకదుర్గా ప్రసాద్, వైస్ చైర్మన్‌గా కాటి సుధాకర్, మెంబర్లుగా కంభంపాటి సుబ్రమ్మణ్యేశ్వరరావు, కొసరాజు రత్నకుమారి, దేవల రాజశేఖరరావు, నాగులపల్లి రంగారావు, పామర్తి నాగజ్యోతి, తోట హేమలత, బోడవరపు నళిని కుమారి, పులిపాటి శ్యామలాదేవి, కొండే జోజిలత, ఆవాల లీలావతి, కట్నేని తులసిరామ్, పసుపులేటి రాజేష్, పెదపాడు కోఆపరేటివ్ సొసైటీ ప్రెసిడెంట్, జిల్లా వ్యవసాయ మార్కెటింగ్ ఆఫీసర్, వ్యవసాయ శాఖ జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్, గోపన్నపాలెం సర్పంచ్‌లను నూతన పాలకవర్గంగా నియమించారు. గౌరవ చైర్మన్‌గా ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ఉంటారు.

మంత్రులు రాక

ఈ నెల 21న ఆదివారం చైర్మన్, పాలకవర్గం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ప్రమాణస్వీకార కార్యక్రమం సందర్భంగా హనుమాన్ జంక్షన్‌లోని అభయాంజనేయస్వామి దేవస్థానం నుంచి ర్యాలీగా మొదలై జంగారెడ్డిగూడెం వెళ్లే రోడ్డులో గోపన్నపాలెం నుంచి పెదవేగి రోడ్డులో వ్యవసాయ మార్కెట్ యార్డులో ఉదయం 11.25 గంటలకు ప్రమాణ స్వీకారం జరగనుంది. కార్యక్రమానికి జిల్లా ఇన్‌చార్జి మంత్రి పినిపే విశ్వరూప్, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, హోం శాఖ మంత్రి తానేటి వనిత, పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు, సమాచార శాఖ మంత్రి చెల్లుబోయిన గోపాలకృష్ణ, ఏపీ ఆయిల్‌ఫెడ్ మాజీ చైర్మన్ కొఠారు రామచంద్రరావు, ప్రజాప్రతినిధులు హాజరు కానున్నారు.

ఏఎంసీలో అభివృద్ధి పనులు

దెందులూరు ఏఎంసీలో రూ. 50 లక్షలతో ఆఫీస్ బిల్డింగ్, రూ. 50 లక్షలతో కాంపౌండ్ వాల్, రూ. 50 లక్షలతో సీసీ రోడ్లు, రూ. 30 లక్షలతో రక్షిత మంచి నీటి పథకం నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఏఎంసీలో నూతనంగా పెట్రోలు బంకు మంజూరైంది. స్థల పరిశీలన రాష్ట్రాధికారులు చేశారు.

ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే కొఠారు

పెదవేగి మండలం లక్ష్మీపురంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన చైర్మన్ ప్రమాణ స్వీకారం కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి లక్ష్మీపురం యార్డ్ ప్రాంగణాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. ప్రజలకు, నాయకులకు ఎటువంటి అంతరాయం లేకుండా చూసుకోవాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి నాయకులు పాల్గొన్నారు.

ఏఎంసీని అభివృద్ధి పథంలో నిలిపేందుకు కృషి



ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి, ఏపీ ఆయిల్‌ఫెడ్ మాజీ చైర్మన్ కొఠారు రామచంద్రరావు, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్, వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలకు రుణపడి ఉంటా. దెందులూరు ఏఎంసీని అభివృద్ధి పథంలో నిలిపేందుకు అహర్నిశలు కృషి చేస్తా.

– అప్పన ప్రసాద్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్

వేంకటేశ్వర స్వామికి వెండి హారం అలంకరణ



గుండుగొలనులో వెండి హారాన్ని అందజేస్తున్న దాత ఆర్జా మధుమూర్తి దంపతులు

భీమడోలు: గుండుగొలనులోని శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర ఆలయంలో శనివారం స్వామి వారికి ఏలూరుకు చెందిన ఎన్ఆర్ఐ ఆర్జా మధుమూర్తి దంపతులు రూ.94,364 విలువైన 108 లక్ష్మీరూపులు గల వెండి హారాన్ని సమర్పించారు. శనివారం సంప్రోక్షణ పూజల అనంతరం స్వామి వారికి ఈ హారాన్ని అలంకరించారు. టీటీడీ నిధులతో ఈ ఆలయాన్ని నిర్మించిన విషయం తెలిసిందే. ఆలయ పూజారులు మంగిపతి ఆచార్యులు, మోహన కృష్ణాచార్యులు స్వామి వారికి విశేష పూజలు చేసి హారాన్ని స్వామి వారికి అలంకరించారు. అనంతరం దాతలను కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. పరిసర గ్రామాలకు చెందిన భక్తులకు స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో డి.శంకరరావు, ఆలయ అభివృద్ధి కమిటి నిర్వాహకులు వగ్వాల మీనాకుమారి అచ్యుతరామారావు పాల్గొన్నారు.

కొల్లేరు వాసుల సేవలకు.. ఇక సెలవు

- బ్రిటిష్ కాలంనాటి వంతెన కూల్చివేత
- కొత్త వంతెన నిర్మాణానికి రూ.3.5 కోట్ల నిధులు మంజూరు



గుండుగొలనులో పాత వంతెనను కూల్చిన అధికారులు



బ్రిటిష్ కాలం నాటి వంతెన ఇదే

భీమడోలు: కొల్లేరు గ్రామాల ముఖ ద్వారమైన గుండుగొలను వద్ద గోదావరి కాల్వపై నిర్మించిన వంతెనను శనివారం కూల్చేసారు. బ్రిటిష్ కాలంలో నిర్మించిన ఈ వంతెన నేడు శిథిలమవడంతో జేసీబీ సాయంతో రెండు రోజుల పాటు శ్రమించి కూల్చివేశారు. కొల్లేరు వాసులకు ఇప్పటి వరకు విస్తృత సేవలందించి వారి అభివృద్ధిలో కీలక పాత్ర పోషించిన ఈ వారధి ఇక సెలవు తీసుకుంది. దీనితో కొత్త వంతెన నిర్మాణ పనులకు మార్గం సుగమమైంది. సుమారు 120 ఏళ్ల క్రితం గోదావరి కాల్వపై బ్రిటిష్ వారు ఈ వంతెన నిర్మించారు. అప్పటి నుంచి భీమడోలు, దెందులూరు, ఏలూరు రూరల్, కైకలూరు ప్రాంతాల 20 గ్రామాలకు చెందిన 40 నుంచి 50 వేల మంది ప్రజల వారి జీవనయానంలో రవాణా మార్గం ఉండి వారి అభివృద్ధిలో తన వంతు సేవలందించింది. ఈ ప్రాంతాల ప్రజలతో మమేకమైన ఈ వంతెన స్థానికులకు మధుర జ్ఞాపకాలు మిగిల్చింది. ప్రధానంగా కొల్లేరులోని ఆక్వా రంగం అభివృద్ధికి ఈ వంతెన ప్రధాన భూమికగా ఉంది. ఈ వంతెన గత సెప్టెంబర్‌లో పాక్షికంగా కూలడంతో ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనితో ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు ప్రత్యేక శ్రద్ధ వహించి ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా బెయిలీ వంతెన నిర్మించడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. పాత వంతెన స్థానంలో కొత్త వారిధి నిర్మించేందుకు ఎమ్మెల్యే వాసుబాబు కృషి చేశారు. వంతెన ప్రాధాన్యతను సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి ఆయన తీసుకెళ్లారు. దీంతో రూ.3.5 కోట్ల నిధులు మంజూరయ్యాయి. వారధి నిర్మాణానికి సాంకేతిక అనుమతులు పొందారు. దీనితో పాత వంతెనను పూర్తిగా కూల్చారు. ఆ వంతెన స్థానంలో రెండు లైన్లలో వాహనాలు రాకపోకలు సాగించేలా కొత్త వంతెన నిర్మాణం చేపడుతున్నారు.

నేడు కొత్త వంతెన నిర్మాణ పనులకు శంకుస్థాపన

గుండుగొలను వద్ద గోదావరి కాల్వపై నిర్మించనున్న కొత్త వంతెన నిర్మాణ పనులకు ఈనెల 21న ఆదివారం ఉదయం 10.30 గంటలకు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు శంకుస్థాపన చేస్తారని మండల వైసీపీ కన్వీనర్ రావిపాటి సత్యశ్రీనివాస్, గ్రామ పార్టీ అధ్యక్షుడు ముదుండి సూర్యనారాయణరాజు శనివారం రాత్రి తెలిపారు. దీంతో ఈ ప్రాంత ప్రజల చిరకాల వాంఛ నెరవేరుతుందన్నారు. ఈ వంతెన నిర్మాణ పనులను జీఆర్ నిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో కాల్వలకు నీరు విడుదల చేసే సమయానికి వంతెన పనులు పూర్తి చేస్తారన్నారు.

ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ

భీమడోలు: భీమడోలు మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో సభ్యుడు, దాత సలాది వీరబాబు తన కుమార్తె సలాది రేవతి జ్ఞాపకార్థం శనివారం భీమడోలులోని ప్రజలకు మజ్జిగ పంపిణీ చేసారు. భీమడోలు బస్టాండ్‌లోని ప్రయాణికులకు, రోడ్డుపై వాహనదారులకు ఆయన మజ్జిగ పంపిణీ చేసారు. భీమడోలు బైపాస్ రోడ్డులో సంతమార్కెట్ శ్రీసత్యసాయి సేవా సంస్థ ఆధ్వర్యంలో వందలాది మందికి మజ్జిగను పంపిణీ చేసారు. ఈ కార్యక్రమాల్లో సత్యసాయి సేవా సమితి భీమడోలు జోన్ అధ్యక్షుడు వర్ధినేడి సత్యసాయి, జిల్లా అధ్యక్షుడు రామిశెట్టి గంగాధరరావు, గ్రామాల కన్వీనర్లు దూడి రాజేష్, అల్లాడ ప్రసాదరావు, నాగమణి, ఆటో డ్రైవర్లు బత్తుల రంగారావు, సత్యసాయి సేవా సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

గుండెపోటుతో ఉపాధి కూలీ మృతి

దెందులూరు: కొవ్వలిలో జాతీయ ఉపాధి హామీ పథకం పనులు చేస్తూ శనివారం ఒక కూలీ గుండెపోటుతో మృతి చెందాడని దెందులూరు ఏపీవో దశరధరామ్‌జీ అన్నారు. కొవ్వలిలో తుమ్మల వెంకటేశ్వరరావు (62) మొండికోడు కాలువ డ్రెయిన్ పనులు చేస్తున్నాడు. ఈ సమయంలో గుండె నొప్పి వచ్చింది. ఆసుపత్రికి తరలిస్తుండగా, మృతి చెందాడని ఏపీవో తెలిపారు. ఎంపీడీవో ఏబీపీవీ లక్ష్మి, ఏపీవో దశరధరామ్‌జీ మృతిచెందిన తుమ్మల వెంకటేశ్వరరావు మృతదేహాన్ని పరిశీలించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు

సంక్షేమ పథకాలతో ప్రతి ఒక్కరికీ మేలు



పిప్పరలో వృద్ధుడి సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే వాసుబాబు

గణపవరం: నాలుగేళ్లుగా రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలతో ఇంటిలోని ప్రతి ఒక్కరికీ మేలు చేకూర్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పేదలకు ఆరాధ్యదైవంగా మారారని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. శనివారం గణపవరం మండలం పిప్పర గ్రామ సచివాలయం పరిధిలో 158వ రోజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వాసుబాబు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ చరిత్రలో ఇంతవరకూ ఏ ప్రభుత్వమూ అమలు చేయని సంక్షేమ పథకాలను చేపట్టిన జగన్‌ను మరోసారి అధికారంలోకి తీసుకురావడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వాసుబాబు పార్టీ నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. వారి సమస్యలపై ఆరా తీశారు. అర్హతే ప్రామాణికంగా అర్హులందరికీ నూరుశాతం పథకాలు అందజేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో గణపవరం ఎంపీపీ అర్ధవరం రాము, జెడ్పీటీసీ దేవారపుసోమలక్ష్మి బాబులు, సర్పంచ్ కాకరబేబీ, మండల ఉపాధ్యక్షురాలు నీతిపూడి వీరమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు వీరవల్లి దానమ్మ, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ దండు రాము, గ్రామ పార్టీ నాయకులు కాకరశ్యాం, ఇందుకూరి చినబాబు, ముత్యాల రాంబాబు, ప్రకాష్ రాజు, ఐఎస్ఎన్‌రాజు, కాశిపాడు సర్పంచ్‌లు కోట నాగేశ్వరరావు, గోపవరం ఎంపీటీసీ సభ్యుడు సత్యనారాయణ పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయాల వద్ద అన్నసమారాధనలు

భీమడోలు: హనుమద్ జయంతి ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని శనివారం పలు గ్రామాల్లో అన్న సమారాధన కార్యక్రమాలు నిర్వహించారు. పోలసానిపల్లి పంచాయతీ శివారు ఆంజనేయ నగరం, భీమడోలు సంతమార్కెట్ వద్ద భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. భీమడోలు సంతమార్కెట్‌లోని శ్రీ రామ అభయాంజనేయ స్వామి ఆలయం వద్ద అన్నసమారాధన నిర్వహించారు. ఎండను సైతం లెక్క చేయకుండా భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి అన్న సమారాధనలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు బొమ్ము సూరి, పెద్దలు యర్రంశెట్టి ఏడుకొండలు పాల్గొన్నారు.

పిల్లలకు సకాలంలో టీకాలు వేయించాలి

గణపవరం: ఐదేళ్లలోపు పిల్లలకు సకాలంలో వ్యాధినిరోధక టీకాలు క్రమం తప్పకుండా వేయించాలని గణపవరం పీహెచ్‌సీ వైద్యాధికారి పులపర్తి సంతోష్ అన్నారు. శనివారం గణపవరం, సరిపల్లె, అర్ధవరం, జల్లికొమ్మరలో పిల్లలకు, గర్భిణులకు సార్వత్రిక వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడాది లోపు పిల్లలకు బీసీజీ టీకాలు, ఐదేళ్లలోపు పిల్లలకు, గర్భిణులకు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. ఈకార్యక్రమంలో సీహెచ్‌వో జాలాది విల్సన్, ఆరోగ్యసహాయకుడు యోహాన్ పాల్గొన్నారు.

పూళ్లలో సువార్త కూడికలకు ఏర్పాట్లు

భీమడోలు: పూళ్ల పడమర హరిజన పేటలోని ఆరోగ్య మాత క్రైస్తవాలయంలో ప్రథమ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు శనివారం రాత్రి నిర్వాహకులు పేర్కొన్నారు. ఆరోగ్య మాత చర్చిలో ఈనెల 21 నుంచి 23వ తేదీ వరకు సువార్త కూడికలు నిర్వహిస్తామని సంఘం పెద్దలు, యూత్ సభ్యులు తెలిపారు. ఈనెల 23వ తేదీ మంగళవారం ఉదయం 12.30 గంటకు సుందరంగా నిర్మించిన దేవాలయం ప్రథమ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. విశ్వాసులు, సంఘ సభ్యులందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని దేవుని ఆశీస్సులు పొందాలని కోరారు. ఈ కార్యక్రమాలకు రీజనల్ సుపీరియర్ జోళి, ఫాదర్లు షింటో, నెల్సన్, టోనీ, జోషి పాల్గొంటారన్నారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర ప్లానింగ్ కమిషన్ సీఈవో విజయకుమార్ హాజరవుతారని వారు తెలిపారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా వేసవి శిక్షణ



భీమడోలులో స్పోకెన్ ఇంగ్లీషు తరగతుల్లో పాల్గొన్న చిన్నారులు, రిసోర్స్‌పర్సన్లు

భీమడోలు: భీమడోలు, పూళ్ల, గుండుగొలను శాఖా గ్రంథాలయాల్లో చిన్నారులకు వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు శనివారం కొనసాగించారు. ఉల్లాస భరిత వాతావరణంలో చిన్నారులంతా పుస్తక పఠనం చేస్తున్నారు. భీమడోలు గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో రిసోర్స్‌పర్సన్లు మండే సుధాకర్, పోలిశెట్టి వీరవెంకట సత్యనారాయణ, ఈతకోట భవ్యశ్రీలు చిన్నారులకు అవసరమైన శిక్షణ అందించారు. డైమండ్స్ లయన్స్ క్లబ్ కోశాధికారి పోలిశెట్టి వీరవెంకట సత్యనారాయణ చిన్నారులకు స్పోకెన్ ఇంగ్లీషుపై పట్టు సాధించేలా వారికి తర్ఫీదు అందిస్తున్నారు. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్ చిన్నారులకు నీతి కథలతో పాటు ఇంగ్లీషు, తెలుగు పదాలపై అవగాహన కల్పించారు. చిన్నారులకు పుస్తక సమీక్షలు రాసారు. చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. చిన్నారుల్లో సృజనాత్మకతను పెంపొందించే డ్రాయింగ్‌పై మక్కువ కలిగి ఉండాలని మండే సుధాకర్ పేర్కొన్నారు. గ్రంథపాలకులు డీఎన్‌వీ అమర్‌నాథ్, జి.నాగమణి, యోగా గురువులు భావనారుషి, కురెళ్ల కిషోర్ పాల్గొన్నారు.

నేడు లబ్ధిదారులకు ఇంటి పట్టాల పంపిణీ

నిడమర్రు: నవరత్నాలు- పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా బావాయిపాలెం గ్రామానికి చెందిన 38 మంది లబ్ధిదారులకు ఆదివారం ఉదయం 8 గంటలకు బువ్వనపల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పట్టాలు పంపిణీ చేయనున్నట్టు మండల కన్వీనర్ సంకు సత్యకుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు పాల్గుంటారన్నారు. బావాయిపాలెంకు చెందిన వైసీపీ శ్రేణులు హాజరవ్వాలని సత్యకుమార్ కోరారు.

చురుగ్గా అండర్‌పాస్ నిర్మాణం



దెందులూరు - అలుగుగూడెం రైల్వే గేటు వద్ద నిర్మిస్తున్న అండర్‌పాస్ వంతెన

దెందులూరు: దెందులూరు - అలుగులగూడెం రైల్వే క్రాసింగ్ గేటు వద్ద అండర్‌పాస్ నిర్మాణం పనులు వేగంగా సాగుతున్నాయి. శనివారం రైల్వే డీఈ వెంకటేశ్వరావు, నిర్మాణం పనులను పరిశీలించారు. నిర్మాణం పనుల పట్ల డీఈ సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట దెందులూరు కో-ఆపరేటివ్ సొసైటీ డైరెక్టర్ మటపర్తి రాంబాబు ఉన్నారు.

ఫుట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎంపీ శ్రీధర్ ఎంపిక

పెదపాడు: ఫుట్‌బాల్ అసోషియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ ఎంపికవడంపై పలువురు నాయకులు శనివారం హర్షం వ్యక్తం చేసారు. ఇటీవల జరిగిన ఫుట్‌బాల్ అసోషియేషన్ ఎన్నికల్లో క్రీడల పట్ల ఆసక్తి, అభిరుచి కలిగిన శ్రీధర్‌ను ఎనుకోవడంపై నాయకులు ఆనందం వ్యక్తం చేశారు. నర్సాపురం నియోజకవర్గ పరిశీలకుడు ఘంటా ప్రసాదరావు, రాష్ట్ర హస్తకళల కార్పొరేషన్ డైరక్టరు ముదుగురు సూర్యనారాయణ, జిల్లా బీసీ సంఘం యూత్ అధ్యక్షుడు బెజవాడ నర్సింహరావు తదితరులు ఎంపీ శ్రీధర్‌ను అభినందించారు.

ఆర్థిక సహాయం అందజేత

దెందులూరు: మసీదుపాడులో అనారోగ్యంతో బాధపడుతున్న మాత్రపు బుజ్జిబాబుకు శనివారం చేయూత స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు రూ.12 వేలు, బియ్యం బస్తా గోపన్నపాలెం సర్పంచ్ కోటే నాగమల్లేశ్వరి కుమార్ చేతులమీదుగా అందించారు. పలువురు సంస్థ సభ్యులు పాల్గొన్నారు.